క్లుప్తంగా

ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు

● రెండు రోజులు కుళాయిల బంద్

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని బూర్లివీధిలో ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టడంతో రెండు రోజుల పాటు కుళాయిలు ద్వారా తాగునీరు పంపిణీ జరగదని పంచాయతీ కార్యదర్శి జి.జనార్ధనరావు తెలిపారు. మంగళవారం ఆయన మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్ పూర్తిగా పాడవ్వడంతో, మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు. స్థానికులు గమనించి సహకరించాలని కోరారు.

11న మండల సమావేశం

బొండపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 11న ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన జరగనున్నట్టు ఎంపీడీవో జి.గిరిబాల మంగళవరం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

సీతారామ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం రేపు

బొండపల్లి: బోడసింగిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామా ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలను చేపట్టి 5న హోమాలు, గోపురం ప్రతిష్ఠతో పాటు భారీ ఎత్తున పూజా కార్యక్రమాలు, అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

పాఠశాలలు తెరిచే నాటికి ఎస్ఆర్‌కేవీఎం కిట్లు

● రాష్ట్ర పరిశీలకుడు ప్రసాదరావు



స్టాక్ పాయింట్‌కు చేరిన పుస్తకాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు ప్రసాదరావు

కొత్తవలస : పాఠశాలలు తెరిచే నాటికి ప్రతీ విద్యార్థికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర (ఎస్ఆర్‌కేవీఎం) కిట్లు అందే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశీలకుడు ఎస్.ప్రసాదరావు సూచించారు. మండల ఎంఆర్‌సీ భవనంలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను జిల్లా సమగ్రశిక్ష సీఎంవో వి.ఆదినారాయణతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ పాయింట్‌కు చేరిన వస్తువుల నాణ్యతను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంతమేర స్టాక్ వచ్చింది, ఇంకా రావల్సిన స్టాక్ ఎంత తదితర విషయాలను ఎంఈవో 2 బి.శ్రీనివాసరావుని అడిగి తెలుసుకున్నారు. యూనిఫాంలు, షూస్, మీడియం సైజ్ బ్యాగులు రావాల్సి ఉందన్నారు. ఆయన వెంట ఎంఆర్‌సీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నవ ధాన్యాల సాగు పరిశీలన



కుమ్మపల్లిలో నవధాన్యాల సాగు పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం అధికారులు

వేపాడ: మండలంలో పలు యూనిట్ల పరిధిలో సాగు చేస్తున్న నవధాన్య పొలాలను ప్రకృతి వ్యవసాయం సిబ్బంది మంగళవారం పరిశీలించారు. కుమ్మపల్లి యూనిట్‌లో డీఎల్ఎంపీ స్వామినాయుడు, ఆకులసీతంపేట యూనిట్‌లో ఎస్ఎస్‌పి వరప్రసాద్, కరకవలస, పాటూరు యూనిట్స్‌లో ఎస్ఎస్‌పి రమేష్, వీలుపర్తి, కొండగంగుబూడి యూనిట్‌లో ఎస్ఎస్‌పి శంకర్ నవధాన్యాల సాగు పొలాలను సందర్శించి పరిశీలించారు. లక్ష్యం మేరకు నవధాన్యాలు కిట్లు పంపిణీ, సాగుపై ఆరా తీశారు. విత్తనాలు తీసుకున్న రైతులు సాగు చేస్తున్నారా.. లేదా.. అని పరిశీలించటంతో పాటు స్టాకు వున్న నవధాన్యాలు ప్యాకెట్లను తనిఖీ చేశారు.

శ్మశాన వాటికకు రహదారి నిర్మించండి



శ్మశాన వాటికకు వెళ్లే దారిని చూపిస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

మెరకముడిదాం: మండలంలోని రాచగుమడాం శ్మశాన వాటికకు రహదారిని నిర్మించాలని గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీవాసులు కోరారు. ఎస్సీ కాలనీలో మొత్తం 302 కుటుంబాలు వరకూ జీవిస్తున్నామని, ఎవరైన మృతి చెందితే తాము శ్మశాన వాటికకు వెళ్లేందుకు రహదారి లేకపోడంతో నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఎవరైన మృతి చెందితే మృతి చెందారన్న బాధ కంటే శ్మశాన వాటికకు ఆ మృతదేహాన్ని ఎలా తీసుకువెళ్లాలన్న బాధ ఎక్కువగా ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్సీ కాలనీ నుంచి శ్మశాన వాటికకు సీసీ రహదారి నిర్మించాలని కోరుతున్నారు.

'వెన్నుపోటు దినం'కు తరలిరండి

● మాజీ ఎమ్మెల్యే బొత్స

గజపతినగరం రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రంలో బుధవారం చేపట్టనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన నాయకులతో ఆయన సమావేశమయ్యారు. బుధవారం జరగనున్న వెన్నుపోటు దినం కార్యక్రమంపై వారితో చర్చించారు. ప్రతీ గ్రామం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ గార తవుడు, మండల పార్టీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, మండల నాయకులు మండల సురేష్, బెల్లాన త్రినాధరావు, కరణం ఆదినారాయణ, కర్రి రామునాయుడు, కె.పైడపునాయుడు, నానాజీతో పాటు పలువురు పాల్గొన్నారు.



గజపతినగరం రూరల్: నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

వెన్నుపోటు దినం విజయవంతం కావాలి

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో ప్రజలను మోసం చేసిన తీరును ఎండగడుతూ తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. బుధవారం జరగనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి మండలంలో కార్యకర్తలు సమన్వయం చేసేందుకు మంగళవారం అన్ని గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది కావస్తున్నప్పటికీ కనీసం ఒక్క హామీ కూడా నెరవేర్చ లేదన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం ప్రజలను వంచించి మోసం చేయడం చంద్రబాబు నైజమన్నారు. అయితే పేద ప్రజలు పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. వెన్నుపోటు దినం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, బాలుర ఉన్నత పాఠశాల పీఎంసీ కమిటీ చైర్మన్ గవిడి సురేష్, అలజంగి సర్పంచ్ రఘుమండ త్రినాధ తదితరులు పాల్గొన్నారు.



అలజంగిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

40 ఆటోలతో..

దత్తిరాజేరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం నియోజకవర్గ కేంద్రంలో జరగనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి 40 ఆటోలతో తరలివెళ్లనున్నట్టు ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జునతో కలిసి విలేకరులతో మంగళవారం తెలిపారు. ఎన్నికల వేళ ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయని కూటమి ప్రభుత్వానికి తగిన సమయంలో ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. మాజీ సర్పంచ్‌లు మహదేవ్ ఫణీంద్రుడు, రెడ్డి సింహాచలం ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు

పేదలను మోసం చేసిన చంద్రబాబు



ఎన్నికలలో తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను నట్టేట ముంచడం చంద్రబాబు నైజం. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలు కొన్నైనా నెరవేర్చుతారని ప్రజలు నమ్మి ఓట్లు వేసినందుకు చంద్రబాబు తమకు గుణపాఠం చెప్పారు. ఇలాంటి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు. మారలేదు,అతనికి పిల్లను ఇచ్చిన మామతో పాటు ప్రజలకు వెన్నుపోటు పొడవడం అలవాటుగా మారి పోయింది,ఇలాంటి ప్రభుత్వానికి ఎన్నుపోటు దినాలు ఎన్ని చేసినా తప్పు లేదు.

– రాపాక కృష్ణార్జున, దత్తి గ్రామం

తరలిరండి..

వేపాడ: ఎస్.కోటలో బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగన్నాథం పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మంగళవారం మాట్లాడారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో కూటమి వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ఎస్.కోటలోని ఆకుల డిపో నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇచ్చిన హామీలు అమలు చేయలేదని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్.కోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని దాన్ని విస్మరించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, ఎంపీటీసీ టీవీ రమణ, సర్పంచ్‌లు మురిపిండి గంగరాజు, అడపా సతీష్, నాయకులు దండు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



వెన్నుపోటు దినం కరపత్రాలను ఆవిష్కరించిన మండల నాయకులు



వెన్నుపోటు దినం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తదితరులు

లోఫర్ సిక్స్..

శృంగవరపుకోట: కూటమి సర్కార్‌కు సూపర్ సిక్స్ కొట్టేందుకు ఏడాది చాల్లేదు.. అది సూపర్ సిక్స్ టీమ్ కాదు.. ప్రజలను మోసగించే లోఫర్ సిక్స్ టీమ్ అని ఎస్.కోట నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్ అధ్యక్షతన పార్టీ శ్రేణులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి వెన్నుపోటు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలో రెడ్ బుక్ రాజ్యాంగమని ప్రజలను మోసం చేసి, మహిళలు, యువతను దగా చేసి, అవినీతిలో టాపర్లు అయ్యారన్నారు. రాష్ట్రంలో అరాచకత్వం సృష్టిస్తూ.. కేసులతో బెదిరిస్తూ.. హత్యలకు, కుట్రలకు తెగబడుతున్న కూటమి నేతలు రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. ప్రజలను వెన్నుపోటుదారుల నుంచి కాపాడేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నడుం బిగించారని అందులో భాగంగా వెన్నుపోటు దినం కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. బుధవారం ఎస్.కోటలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమం ఉదయం 9 గంటలకు స్థానిక ఆకుల డిపో నుంచి ప్రారంభమవుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, వాకాడ రాంబాబు, షేక్ రహ్మాన్, సర్పంచ్‌లు ఎం.యామినీదేవి, కె.వెంకటరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజుల చెరువుపై రోడ్డు నిర్మాణం నిలుపుదల

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామ రెవెన్యూ పరిధిలో గల రాజుల చెరువుపై నిర్మాణం చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు మంగళవారం పరిశీలించి నిలిపి వేశారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికతో పాటు తహసీల్దార్‌కు ఇటీవల నెలివాడ గ్రామానికి చెందిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులను నిలిపి వేయాలని ఆదేశించినట్టు తెలిపారు. సర్వే నంబరు 6లో రాజులు చెరువులో అక్రమంగా రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్టు పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో అధికారులతో కలిసి సర్వే నిర్వహించి పనులను నిలుపుదల చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ హరికృష్ణ, సర్వే సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



రాజుల చెరువులో రోడ్డు నిర్మాణ పనులను నిలిపి వేయిస్తున్న తహసీల్దార్

మలేరియాపై అప్రమత్తత అవసరం

బొండపల్లి: ప్రాణాంతక మలేరియా పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ సూచించారు. మలేరియా మాసోత్సవంలో భాగంగా మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, మురుగు నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో తిరుపతిరావు, హెల్త్ సూపర్‌వైజరు ఎస్.ఎ.భాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బొండపల్లిలో మలేరియాపై అవగాహన ర్యాలీ

మలేరియాపై అవగాహన అవసరం



ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

గంట్యాడ: మలేరియా వ్యాప్తి, చికిత్సపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం గంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ వందన అన్నారు. మలేరియా మాసోత్సవంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ నుంచి గంట్యాడ వరకు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హెచ్ఎస్ తిరుపతినాయుడు, హెచ్‌వీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'కోట'లో యోగాంధ్ర ర్యాలీ



ఎస్.కోటలో యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, మహిళలు

శృంగవరపుకోట: ప్రభుత్వ ఆదేశాలతో ఎస్.కోట పట్టణంలో తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో సతీష్ నేతృత్వంలో పలు శాఖల ఉద్యోగులు, డ్వాక్రా సంఘాల మహిళలు, ఉపాధి వేతనదారులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు మంగళవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో యోగాసనాలు అభ్యసన కార్యక్రమం నిర్వహించారు.

స్టాపర్ల ఏర్పాటు



నాలుగురోడ్ల కూడలిలో స్టాపర్లను ఏర్పాటు చేస్తున్న పోలీస్ అధికారులు

గజపతినగరం రూరల్: రహదారి ప్రమాదాల నివారణకు మండల కేంద్రంలోని నాలుగురోడ్ల కూడలిలో స్టాపర్లు ఏర్పాటు చేసినట్టు సీఐ ఏవీ రమణ తెలిపారు. మంగళవారం నాలుగురోడ్ల కూడలి వద్ద స్టాపర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని వాహన వేగాలను నియంత్రించినట్టయితే ప్రమాదాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని స్టాపర్లును ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు, పాదచారులు గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయనతో పాటు ఎస్ఐ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు ఏమయ్యాయి!

లక్కవరపుకోట /కొత్తవలస : గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు కొత్తవలస, లక్కవరపుకోట మండలాలకు పలు హామీలు ఇచ్చారు. అయితే వాటి అమల్లో ఏడాదిలో పూర్తిగా విఫలమయ్యారు. వారిచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చిన దాఖలాల్లేవు.

ఇచ్చిన హామీలివీ..

లక్కవరపుకోట మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, భీమాళి గ్రామం నుంచి మామిడి తాండ్ర రైతులకు శీతలీకరణ గిడ్డంగి ఏర్పాటు, ఎస్.కోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో విలీనం చేస్తామని నారా లోకేష్ ఎన్నికల ప్రచారంలో సోంపురం సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హామీలిచ్చారు. ఇందులో ఏ ఇక్కటీ అమలు కాలేదు. కొత్తవలస మండలానికి గిరిజన యూనివర్సిటీని తిరిగి యథాస్థానంలోకి తీసుకొస్తామని, కొత్తవలస మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని, కొత్తవలస మండలాన్ని పారిశ్రామిక మండలంగా తీర్చిదిద్దుతామని లోకేష్ పలు సందర్భాల్లో హామీలిచ్చి ఇప్పుడు మరిచారు.

ఉత్తి హామీలే..



కూటమి నేతల మాటలు కోటలు దాటాయి. ఎన్నికల సమయంలో ప్రచారంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. అభివృద్ధి పనుల్లో అక్రమాలకు పెద్ద ఎత్తున పాల్పడుతున్నారు. అధికారులు ఉత్సవ మూర్తుల్లా చూస్తున్నారు.

– పినిశెట్టి కిష్టప్పదొర, రెల్లిగౌరమ్మపేట, లక్కవరపు కోట

ఎంఆర్‌పీ ధరలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

కొత్తవలస : మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పీ ధరలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ శాఖ సీఐ రాజశేఖరనాయుడు హెచ్చరించారు. కొత్తవలస సర్కిల్ పరిధిలోని 17 మద్యం దుకాణాలను ఎక్సైజ్ సిబ్బందితో కలిసి ఆయన మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం దుకాణాల్లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. అలాగే షాపులు ఉదయం 10 గంటలకు తెరిచి రాత్రి కచ్చితంగా 10 గంటలకు మూయాలని సూచించారు. షాపుల్లో లూజ్, కల్తీ మద్యం విక్రయించినట్టు రుజువైతే కేసులు తప్పవని హెచ్చరించారు. షాపుల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా వుంచే బాధ్యత షాపుల నిర్వాహకులదేనని తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తవలస మండల కేంద్రంలోని షాపును పరిశీలిస్తున్న సీఐ

కూటమి 'సిక్స్' కొట్టేదెప్పుడు!

శృంగవరపుకోట : ఎన్నికల వేళ ఎన్నెన్నో హామీల వర్షం కురిపించిన తెలుగుదేశం నేతలు నేడు అభివృద్ధి కోసం ఆలోచన చేయని తీరు విస్మయం కల్గిస్తోంది. జనవరి నాటికి గోతులు లేని రోడ్లు మా లక్ష్యం అన్న కూటమి నేతలకు సోంపురం–ఆనందపురం రహదారి దుస్థితిగాని, వేపాడ మండల ప్రజల పాట్లుగాని కనిపించటం లేదు. ఎస్.కోటలో ఐటీ టవర్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో ఎస్.కోటలో చంద్రబాబు ఇచ్చిన మాట దేముడెరుగు పట్టణం నడిబొడ్డునున్న గాంధీపార్కు బహిర్భూమిగా మారక ముందే పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. జామి, కొత్తవలస రైతు బజార్లు, జామి, కొత్తవలసల్లో ప్రభుత్వ కళాశాలల ఏర్పాటుపై గతంలో పదేళ్ల కాలం పాటూ అధికారంలో ఉన్నప్పుడు ప్రస్తావించిన దేశం ఎమ్మెల్యేగాని, నాయకులుగాని ఇప్పుడు నోరు విప్పకపోవటం విడ్డూరం. పుణ్యగిరిని పర్యాటక క్షేత్రంగా మార్చేస్తామంటూ మరోమారు ఎన్నికల వేళ ఊదరగొట్టినా దాని ఊసే లేదు. ఎస్.కోట పంచాయతీలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ఆలోచన చేయలేదు. ఎస్.కోట పట్టణంలో కన్నెంగెడ్డ, కుళ్లకోనేరుల కుళ్ల వదిలించేస్తామని చెప్పి, నాడు ఫొటోలు దిగి తర్వాత దేశం నేతలు వాటి ఊసెత్త లేదు.

ఉచిత ప్రయాణం ఎప్పుడు



ఎన్నికల సమయంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. ఏడాదైనా దాని ఊసెత్తడం లేదు. ఇప్పటి వరకు ఉచిత బస్సు ప్రయాణం కోసం అసలు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఇచ్చిన హామీ ఏమైనట్టు.

– చింతల సత్యవతి, వార్డు మెంబర్, ఎస్.కోట పంచాయతీ

తల్లికి వందనం ఏదీ..



గత జగనన్న ప్రభుత్వంలో పాఠశాల ప్రారంభం కాగానే అమ్మ ఒడి పేరుతో డబ్బులు వేసేవారు. పథకం పేరు మార్చి తల్లికి వందనం అన్నారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ ఇస్తామన్నారు. గడిచిన ఏడాది తల్లికి వందనం పథకానికి పంగనామం పెట్టారు. ఆడబిడ్డ నిధి అటకెక్కించారు. లక్ష ఉద్యోగాలు అని యువతను ముంచేశారు. మొత్తంగా ప్రజలను మోసం చేశారు.

–మమ్ములూరి వెవెంకటలక్ష్మి, జెడ్పీటీసీ, ఎస్.కోట

మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ

వేపాడ: మండల కేంద్రమైన వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు డా.ఎం.వేణు, ఎ.సంజనీ అధ్యక్షతన మంగళవారం మలేరియా నివారణ మాసోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి నిర్వహించిన ర్యాలీ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ మలేరియాపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి వుండటంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఆంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ వివి. రమణ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'శోభా'యమానంగా యాత్ర



శోభాయాత్రలో సాగుతున్న ఎమ్మెల్సీ రఘురాజు, సిరిసహస్ర, సుధారాజు, సర్పంచ్ సంతోషికుమారి తదితరులు



ప్రత్యేక వాహనంలో తరలుతున్న పంచలోహ మూర్తులు

శృంగవరపుకోట : మేజర్ పంచాయితీ ఎస్.కోట పట్టణం మంగళవారం మధ్యాహ్నం ఆధ్యాత్మికతో అలరారింది. పెరుమాళ్లు వారి శోభాయాత్రతో 'కోట' శోభాయమానం అయ్యింది. పుణ్యగిరి క్షేత్రంలో పుణ్య తిరుమలగిరిలో రూపుదిద్దుకున్న పద్మావతి–గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో త్రయాహ్నిక ప్రతిష్ఠాపన మహోత్సవంలో కొలువుదీరనున్న దేవతామూర్తుల పంచలోహ దేవతామూర్తులు, సుదర్శనం, పూర్ణకళశాలను శోభాయాత్రలో వైభవంగా పట్టణం అంతటా ఊరేగించి, తీసుకొచ్చారు.

కన్నుల పండువగా శోభాయాత్ర

మంగళవారం మధ్యాహ్నం 4గంటలకు పట్టణంలో షిర్డీసాయిబాబా గుడి నుంచి మేళతాళాలు, భాజా భజంత్రీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణలు, భక్తబృందాల కోలాటాలు, భజనల నడుమ పెరుమాళ్లు, అమ్మవార్లు, సుదర్శనం, పూర్ణకలశాలను ప్రత్యేక వాహనాల్లో ఆర్టీసీ కాంప్లెక్స్, దేవీ జంక్షన్, గాంధీబొమ్మ, ప్రకాశం మార్కెట్, దారగంగమ్మ ఆలయాల మీదుగా శోభాయాత్ర పుణ్యగిరి వరకూ కన్నుల పండువగా సాగింది. శోభాయాత్రలో ఎమ్మెల్సీ రఘురాజు, వైస్ ఎంపీపీ సుధారాజు, సర్పంచ్ సంతోషి కుమారి, చిన్నశ్రీను సోల్జర్స్ ప్రెసిడెంట్ సిరిసహస్ర సహా పలువురు పెద్దలు, ఎంపీటీసీలు, భక్తులు హాజరయ్యారు.